



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 253 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 21 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 253 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 21 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur







## ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి..

## నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- ఉక్రెయిన్‌లోని ఒడెస్సా సమీపంలో పౌర నౌకపై క్షిపణి దాడి
- ధాన్యం లోడుతో వెళుతున్న పౌర కార్గో నౌక లక్ష్యంగా దాడి
- దాడిలో మరో భారతీయుడికి తీవ్ర గాయాలు

**పెన్ పవర్ డెస్క్:** ఉక్రెయిన్‌లోని ఒడెస్సా నౌకాశ్రయం సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. ధాన్యంతో వెళుతున్న ఒక పౌర కార్గో నౌకపై క్షిపణి దాడి చేయడంతో, నలుగురు భారతీయులతో సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్రంలో పౌర నౌకల భద్రతకు పొంచి ఉన్న ముప్పును ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. కాగా, ఈ క్షిపణి దాడి చేసింది రష్యానే అని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. టర్కీకి చెందిన, గినియా-బిస్సావ్ పతాకంతో ప్రయాణిస్తున్న 'గోల్డెన్ లియో' అనే బల్క్ క్యారియర్ నౌక, జూలై 19న ఒడెస్సా పోర్టు నుంచి బయలుదేరిన

- మిగతా 2లో

## కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...

- మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో మంత్రి లోకేశ్ భేటీ
- పథకం అమలు, ఆర్థిక సాయం వినియోగంపై ఆరా
- విద్యార్థుల తల్లుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- కొండపనేని టౌన్‌షిప్ పార్కులో ముఖాముఖి కార్యక్రమం

- మిగతా 2లో



## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా

2లో






## సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన

# దేశ రాజధాని

- సీజేపీ కార్యకర్తలపైకి టియర్ గ్యాస్.. ఢిల్లీలో ఉద్రిక్తత.. పార్లమెంట్ గేట్లు బంద్!
- నీట్ అంశంపై సీజేపీ 'చలో సంసద్' పిలుపు
- పార్లమెంట్ వైపు ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- టియర్ గ్యాస్, లాఠీచార్జ్‌తో ఉద్రిక్తత
- ఢిల్లీలో ఇంటర్నెట్ సేవల నిలిపివేత
- అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష విరమణ

- మిగతా 2లో

## భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే



**పెన్ పవర్ డెస్క్:** ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే యువత అత్యంత వ్యతిరేక ప్రధాని మోడీనే అని అభివర్ణించారు. పరీక్షలు నిర్వహించడంలో దారుణంగా విఫలమైన విద్యాశాఖ మంత్రిని కనీసం రాజీనామా చేయమని కోరలేని అసమర్థ ప్రధాని మోడీ అని విమర్శించారు. నీట్ పేపర్ 2026 లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- మిగతా 2లో



## హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు:

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**పెన్ పవర్ డెస్క్:** మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో హైదరాబాద్ 12వ అదనపు సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రేమ పేరుతో నమ్మించి ఒక నిరుపేద మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం

- మిగతా 2లో

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు...

## ఉభయసభలు వాయిదా



- నీట్ లీక్‌పై విపక్షాల నిరసనలతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు
- తీవ్ర గందరగోళం నడుమ ఉభయ సభలు రోజంతటికి వాయిదా
- నీట్ అంశాన్ని ప్రస్తావించకుండా మాట్లాడిన ప్రధాని మోదీ
- విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు కొనసాగనున్న సమావేశాలు

2లో



## అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే..

## రాజకీయం చేయొద్దు

- అయోధ్య విరాళాల దొంగతనం కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు
- ఇది కేవలం నేరానికి సంబంధించిన సాధారణ కేసు అన్న ధర్మాసనం
- సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ
- యూపీ పోలీసుల దర్యాప్తుపై నివేదికను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం

- మిగతా 2లో

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- సమస్యను అంతర్గతంగా చర్చిస్తానని నడ్డా హామీ
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### కొండపనేని టౌన్‌షిప్ పార్కులో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి...

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం అమలు తీరును తెలుసుకునేందుకు విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ లబ్ధిదారులతో నేరుగా సమావేశమయ్యారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని బైపాస్ రోడ్డులో ఉన్న కొండపనేని టౌన్‌షిప్ పార్కులో విద్యార్థుల తల్లులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం పిల్లల చదువులకు ఏ విధంగా ఉపయోగపడుతోందో మంత్రి లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు లబ్ధిదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అదే సమయంలో, ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలను మంత్రి లోకేశ్ స్వీకరించారు. లబ్ధిదారులు చెప్పిన విషయాలను ఆయన ఓపికగా వింటూ, వాటిని పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి అభిప్రాయాలతో పథకాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగినట్లు తెలుస్తోంది.

### తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు.. నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో మాతా--శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 ఇఖఒ/వీఖఒ వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీజేపీ ఆందోళనతో దద్దరిల్లిన దేశ రాజధాని

కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన చలో సంసద్ నిరసన ర్యాలీ మరింత ఉద్రిక్తంగా మారింది. ఉదయమే నిరసనకారులను జంతర్ మంతర్ వద్ద నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ.. వాళ్లు ముందుకు సాగారు. పలు అంచెల్లో ఏర్పాటు చేసిన భద్రతను దాటుకొని మరీ దాదాపు పార్లమెంటు సమీపంలోకి చేరుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. లాఠీఛార్జ్ కూడా చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొని తోపులాట జరిగింది. దీంతో పలువురు నిరసనకారులతో పాటు పోలీసులకూ గాయాలయ్యాయి. ఇదంతా పార్లమెంటుకు 200 మీటర్ల దూరంలోనే జరిగింది. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రధాన ద్వారాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కొన్ని గేట్లను మూసివేశారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు తమ కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని సీజేపీ పిలుపునిచ్చింది. శాంతియుత పోరాటంతోనే లక్ష్యాన్ని సాధిస్తామని సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ ఆందోళనకు ముందు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆత్మహత్య చేసుకున్న ఓ నీట్ విద్యార్థిని తండ్రి విజ్ఞప్తి మేరకు దీక్ష విరమించినట్లు సీజేపీ తెలిపింది. పార్లమెంట్ ర్యాలీకి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని ఆయనను ఒప్పించడంతో దీక్ష ముగిసిందని పార్టీ వెల్లడించింది. జంతర్‌మంతర్ వద్ద మరో వివాదం కూడా చెలరేగింది. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేకపోయినా ఒక అంబులెన్స్‌ను నిరసన ప్రాంగణంలోకి పంపారని సీజేపీ ఆరోపించింది. దాంతో తొక్కిసలాట జరిగే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనను భంగం కలిగించేందుకే ఇలా చేశారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది.

### విపక్షాల నిరసనలతో హోరెత్తిన పార్లమెంటు... ఉభయసభలు వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం వాడివేడిగా ప్రారంభమయ్యాయి. నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో, తొలిరోజే ఉభయ సభలు రోజంతటికీ వాయిదా పడ్డాయి. ఈ సమావేశాలు ఆగస్టు 13 వరకు జరగనుండగా, మొత్తం 19 పనిదినాలు ఉన్నాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా దివంగత సభ్యులకు నివాళులర్పించి, సభ గౌరవాన్ని కాపాడాలని సభ్యులను కోరారు. కానీ, ప్రతిపక్ష సభ్యులు నీట్ వివాదం, విద్యార్థుల ఆత్మహత్యలపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే తరహా దృశ్యాలు కనిపించాయి. సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడుతూ.. స్కైరూట్ రాకెట్ ప్రయోగం, హైడ్రోజన్ రైలు వంటి విజయాలను ప్రస్తావిస్తూ దేశ యువతను ప్రశంసించారు. అయితే, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ వివాదంపై ఆయన ఏమీ మాట్లాడలేదు. మరోవైపు, నీట్ లీక్‌లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ (కాక్‌రోచ్ జనతా పార్టీ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీ చేపట్టారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేసి, నిషేధాజ్ఞలు విధించారు. ఈ సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు.

### హైదరాబాద్ కోర్టు కీలక తీర్పు: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- మొదటి పేజి తరువాయి

కఠిన శిక్ష విధించింది.

పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో పాటు రూ. 10 వేల జరిమానా కూడా విధించింది. ఒకవేళ ఈ జరిమానా చెల్లించకపోతే, నిందితుడు మరో 6 నెలల పాటు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. 2021లో కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘోరం వెలుగుచూసింది. బాలికపై లైంగిక దాడి జరిగినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అత్యంత వేగంగా దర్యాప్తు పూర్తి చేశారు. నిందితుడిపై ఉన్న అభియోగాలను రుజువు చేసేందుకు పక్కా సాంకేతిక ఆధారాలను కోర్టుకు సమర్పించారు. పోలీసులు సమర్పించిన టిష్టమైన ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం.. నిందితుడిని దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి న్యాయం జరిగేలా పక్కా ఆధారాలతో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు ..!







- అయ్యవారి బాగోతాలు -3
- వేగేశ్వరపురం టు భీమడోలు..
- భీమడోలు రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేట్ మహిళ పెత్తనం..
- రికార్డు రూమ్ తాళాలు ఆమె చేతిలోనే ఎందుకు?

**వేగేశ్వరపురం నుంచి భీమడోలు వరకు సదరు సబ్ రిజిస్ట్రార్ అవినీతి ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. సామాన్యులను పీడించడంలో, ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ రికార్డులను అప్పగించడంలో ఈ 'అయ్యగారి' రూటే సెపరేటు అంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో విధులు నిర్వహించి, ప్రస్తుతం భీమడోలులో తిష్టవేసిన సదరు అధికారి వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ బదిలీ వార్తతో పాత పాపాలు మళ్లీ పండాయి. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడ వివాదాలు, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.**

**ఈ నేపథ్యంలో 'పెన్ పవర్' అందిస్తున్న ప్రత్యేక విశ్లేషణాత్మక కథనం... ఎపిసోడ్ 5:**

- వేగేశ్వరపురంలో సామాన్యులకు చుక్కలు చూపించిన వైనం
- భీమడోలుకు మారినా మారని సబ్ రిజిస్ట్రార్ నైజం
- ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక అవినీతి ఫిర్యాదులు
- బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తుల పర్వం
- ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం!
- రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు?
- రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు'.. అంతా వారి ఇష్టారాజ్యం
- అప్లికేషన్ 'బరువు'ను బట్టి ముందే సిద్ధమవుతున్న 'రేట్ కార్డ్'
- ఇది ప్రభుత్వ కార్యాలయమా.. లేక ప్రైవేట్ దళారుల అడ్డానా?
- శాఖా పరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు /భీమడోలు , జూలై 20 :** గతంలో వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ అధికారి పనిచేసిన కాలంలో రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన సామాన్య ప్రజలు నరకం చూశారు. చిన్నపాటి పనుల కోసం కూడా రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో పెట్టడం ఆయనకు అలవాటుగా మారిందని స్థానికులు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. భీమడోలుకు మారినా మారని నైజం స్థాన చలనం కలిగి భీమడోలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినప్పటికీ సదరు అధికారి తన పంథాను మార్చుకోలేదు. పైగా ఇక్కడ అక్రమ వసూళ్లు, ప్రజలతో కఠిన ప్రవర్తన, రైతులను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలతో మరింతగా రెచ్చిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ పెద్దలకు చేరిన అధికారిక ఫిర్యాదులు : ఈ అధికారి వేధింపులు, అవినీతి పరాకాష్టకు చేరడంతో బాధితులు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (భూమి, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు) గారికి ఆధారాలతో సహా అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సబ్ రిజిస్ట్రార్ వ్యవహారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

బినామీల పేర్లతో హైదరాబాద్, విజయవాడల్లో అక్రమాస్తులు? : ఫిర్యాదుదారులు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ సబ్ రిజిస్ట్రార్ సామాన్య ప్రజల నుంచి, రైతుల నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్ముతో విజయవాడ, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ఆఫీసులో ప్రభుత్వ సిబ్బంది డమ్మీ.. ప్రైవేట్ మహిళే సుప్రీం! : భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వింత పోకడలు సాగుతున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకునే అధికారిక సిబ్బందిని పక్కనపెట్టి, ఒక ప్రైవేట్ మహిళకు సదరు అధికారి అసాధారణ ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలు ముందుగా ఆమెనే కలవాలనే అలిఖిత నిబంధన అక్కడ నడుస్తోంది.

రికార్డు రూమ్ తాళాలు ప్రైవేట్ మహిళ చేతిలోనే ఎందుకు? : ఏళ్ల తరబడి అత్యంత భద్రంగా ఉండాల్సిన ప్రభుత్వ ల్యాండ్ రికార్డులు, విలువైన పత్రాలు ఉండే రికార్డు రూమ్ తాళాలు ఆ ప్రైవేట్ మహిళ ఆధీనంలో ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారం వెనుక ఉన్న 'చిదంబర రహస్యం' ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రంగ ప్రవేశం చేసిన ప్రైవేట్ 'త్రిమూర్తులు' : ఆఫీసులో ఆ మహిళ పెత్తనం ఒకెత్తయితే.. కార్యకలాపాలను శాసించడానికి ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగారు. స్థానిక సమాచారం ప్రకారం.. "కుదిరితే శ్రీరాముడు... లేకపోతే అశోకుడు... లేదంటే రాజు..." అనే సూత్రంతో ఈ ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులే ఆఫీసులో అసలు నిర్ణయాధికారులుగా చలామణి అవుతున్నారు. అప్లికేషన్ బరువును బట్టి 'రేట్ కార్డ్' సిద్ధం : కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు స్వభావాన్ని బట్టి ఈ ప్రైవేట్ త్రిమూర్తులే ముందుగా ఒక 'రేట్ కార్డ్' సిద్ధం చేస్తారట. ఏ అప్లికేషన్‌కు ఎంత వసూలు చేయాలి, ఎవరికి ఎంత వాటా వెళ్ళాలి అనేది దరఖాస్తు 'బరువు' (ఆస్తి విలువ)ను బట్టి ముందే ఫిక్స్ చేస్తారని నమ్మదగిన సమాచారం.

ఇది ప్రభుత్వ కార్యాలయమా.. ప్రైవేట్ అడ్డానా? : ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఒక ప్రభుత్వ శాఖ, కొందరు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బందీ అయిపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసుకు వస్తే ప్రభుత్వ అధికారుల కంటే ఈ ప్రైవేట్ దళారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పారదర్శక విచారణకై డిమాండ్ : ప్రభుత్వ రికార్డుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భీమడోలు సబ్ రిజిస్ట్రార్ వ్యవహారంపై జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...

**వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు పై... స్థానికులు ఇచ్చిన పిర్యాదులపై ఆ శాఖ అదికారులు ఎందుకు మౌనం గా ఉన్నారు.. ? నోట్ల కట్ల తో నోర్లు మూయించాడా...? నిజమేనా ..? చదువుతూనే ఉండండి పెన్ పవర్ మరిన్ని ఆధారాలతో ఎపిసోడ్ -6 లో...**

### అయోధ్య టెంపుల్ విరాళాల చోరీ సాధారణ నేరమే.. రాజకీయం చేయొద్దు

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిర విరాళాల దారిమళ్లింపు కేసును రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా హెచ్చరించింది. ఈ కేసులో సీబీఐ విచారణ జరిపించాలని, ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. "ఇది కేవలం నేరపూరిత చర్యకు సంబంధించిన ఒక సాధారణ కేసు. ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని మేము హెచ్చరిస్తున్నాము" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న దర్యాప్తు పురోగతిపై సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత తగిన ఆదేశాలు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది. భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని కొందరు వ్యక్తులు దారిమళ్లించారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. యూపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించారు. దర్యాప్తు కొనసాగుతున్నందున, మరిన్ని వివరాలను ప్రస్తుతం బహిర్గతం చేయలేమని ఆయన తెలిపారు.

ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా సిట్‌ను పునర్వ్యవస్థీకరించే అంశంపై సూచనలు తీసుకోవాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఉంటుందన్న కారణంతో ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. పారదర్శకత కోసం పక్కాగా రికార్డులను నిర్వహించాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ, బంగారం, వెండి వస్తువులు అదృశ్యమవుతున్నాయని, విరాళాలకు సరైన లెక్కలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు జారీ చేసిన రసీదులను ఒక వెబ్‌సైట్‌లో ఉంచాలని, తద్వారా దాతలు తమ విరాళాలు ట్రస్ట్‌కు చేరాయో లేదో సరిచూసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ ప్రతిపాదనను ప్రధాన న్యాయమూర్తి తోసిపుచ్చారు.

### భారతదేశ చరిత్రలోనే అత్యంత యువత వ్యతిరేక ప్రధాని మోడీనే

- మొదటి పేజి తరువాయి

చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం (జులై 20) కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా నిరసనకారులపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన తెలుపుతున్న నిరసనకారులపై లాఠీచార్జ్, టియర్ ప్రయోగం చేయడాన్ని ఉద్దేశిస్తూ మోడీ సర్కార్?పై ఆయన ధ్వజమెత్తారు.

బీజేపీ ప్రభుత్వ హయాంలో 152 ప్రశ్నపత్రాల లీక్ కాగా.. 7.5 కోట్ల మంది విద్యార్థులు బాధితులయ్యారని అన్నారు. ఇప్పటి వరకు ఒక్క దోషికి కూడా శిక్ష పడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ కష్టపడి చదివిన యువతకు మాత్రం శిక్ష పడిందని మండిపడ్డారు. పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నించిన యువతపై లాఠీ దెబ్బలు, నిర్బంధాలు విధించారని నిప్పులు చెరిగారు.

ప్రశ్నపత్రాలను లీక్ చేసిన నేరగాళ్లు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. కానీ సమస్యలు లేవనెత్తిన విద్యార్థులను ఈడ్చుకెళ్లి దారుణంగా కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ పేపర్ లీకులతో యువత జీవితాన్ని నాశనం చేయడమే కాకుండా.. తిరిగి వారిపైనే దాడి చేస్తోందని తూర్పారబట్టారు.

**సీజేపీ చలో పార్లమెంట్:**

నీట్ 2026 పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 20న చలో పార్లమెంట్ కార్యక్రమానికి క్రాకోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. సీజేపీ పిలుపు మేరకు యువత పెద్ద ఎత్తున ఢిల్లీ చేరుకుని చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో సీజేపీ పార్లమెంట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేదని సీజేపీ మద్దతుదారులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, సీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సీజేపీ కార్యకర్తలు, మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా లాఠీచార్జ్ చేశారు. అయినప్పటికీ యువత వెనక్కి తగ్గకుండా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించింది.

సీజేపీ మద్దతుదారులు పార్లమెంట్ లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ గేట్స్ క్లోజ్ చేసి సీజేపీ సపోర్టర్స్ ను అదుపులోకి తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పార్లమెంట్ బయట ఫైర్ బ్రిగేడ్లతో భారీగా పోలీసులను మోహరించారు. పార్లమెంట్ బయట సీజేపీ.. లోపల ప్రతిపక్షాల నిరసనలతో సోమవారం (జులై 20) దేశ రాజధాని ఢిల్లీ దద్దరిల్లింది.

### ఉక్రెయిన్‌లో కార్గో నౌకపై దాడి.. నలుగురు భారతీయులతో సహా పలువురు మృతి

- మొదటి పేజి తరువాయి

కొద్దిసేపటికే ఈ దాడికి గురైంది. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. సహాయక బృందాలు కొందరిని రక్షించి ఒడెస్సాలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో ఉక్రెయిన్ పైలట్‌తో పాటు మరికొందరు మరణించినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ నౌకలో మొత్తం ఐదుగురు భారతీయులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. వారిలో నలుగురు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. "ఉక్రెయిన్‌లోని తాజా పరిస్థితులను తమ బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని, బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వ్యక్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. "వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, అమాయక పౌర సిబ్బంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, నౌకాయానం మరియు వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం అత్యంత విచారకరం. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

### కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

# పోచవరం కాలనీ సమస్యలపై గ్రామస్తులు ఎంపీడీవో కి వినతి...

**కూనవరం,పెన్ పవర్,జూలై 20.** పారిశుద్ధ్య సమస్యలు,వీధిలైట్ల కొరతతో ఇబ్బంది పడుతున్నామని,మండలంలోని పోచవరం కాలనీ గ్రామస్తులు, మండల తెదేపా అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆశీర్వాదం కు వినతి పత్రాన్ని ఇచ్చారు.మాజీ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్లు,బడి ఆవరణంలో పేరుకుపోయిన చెత్త,గ్రామంలో ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడదతో బాధపడుతున్నామని,శానిటేషన్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు విన్నవించిన స్పందించలేదని తెలిపారు.గ్రామ సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరారు.గోదావరి వరదల సమయం కావున ఏడు గుర్రాలపల్లి రహదారి సౌకర్యం కల్పించాలని,గ్రామంలో ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చాలని కోరారు.ఎంపీడీవో స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు.ఈ



కార్యక్రమంలో బర్ల నాగరాజు, వాసం శ్రీను,పదముత్యం ప్రతాప్, శీలం వెంకటేష్,పల్నాటి నగేష్, బుడిపిటి నాగరాజు,పల్లంటి రవీంద్ర,కాపుల పండు,వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# సచివాలయంలో సమస్యలపై గిరిజన సంఘాలతో త్వరలో ప్రభుత్వం చర్చలు

- గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం...ఆందోళన పడకండి!
- జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా ప్రత్యామ్నాయాలు చూస్తున్నాం
- ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన జీవో నెంబర్ 3ను గత ప్రభుత్వం పరిరక్షించలేకపోయింది
- జోన్-1లోకి అల్లూరి సీతారామరాజు జిల్లా, జోన్-2లోకి పోలవరం జిల్లా
- బాక్సైట్ విషయంలో ఆందోళన వద్దు...అవినీతితో అంతర్జాతీయ సమస్యగా మార్చారు
- ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిపై సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి/ రంపచోడవరం, పెన్ పవర్ జూలై 20**: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు.

జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోకవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం." అని అన్నారు.

**త్వరలో గిరిజన సంఘాలతో చర్చలు**

స్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబంధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి... ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. జీవో నెంబర్ 3 ప్రయోజనాలు దక్కేలా చేస్తున్న ప్రయత్నాలను వివరించడంతో పాటు... ఈ ప్రక్రియలో వారిని కూడా భాగస్వాములు చేయాలని సూచించారు.

చట్టపరమైన అడ్డంకులు అధిగమించడానికి గిరిజన సంఘాల సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

బాక్సైట్ మైనింగ్ విషయంలో గిరిజనులు ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. గత పాలకులు తమ అవినీతి కారణంగా బాక్సైట్ లీజుల అంశం



ఇప్పుడు అంతర్జాతీయ కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. గిరిజనుల హక్కులకు, మనోభావాలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు ఉండవని....ఈ విషయంలో ఎవరి ట్రాప్ లోనూ పడవద్దని సిఎం సూచించారు.

అలాగే 1/70 అమలు విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదని... ఇదే విషయాన్ని గిరిజన సంఘాలకు చెప్పాలని సిఎం సూచించారు. అరకు కాఫీని ప్రమోట్ చేసినా...గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రవాణా సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసినా అది కూటమి ప్రభుత్వం గిరిజనులపై చూపిన బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా పూర్తి స్థాయి అభివృద్ధి జరిగినప్పుడే...వారి జీవన ప్రమాణాలు మారినప్పుడే నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వం నమ్ముతోందన్నారు.

గిరిజన సంఘాలతో చర్చలకు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని సిఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని గిరిజన మంత్రి కి, గిరిజన ప్రజాప్రతినిధులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. సిఎం సూచన మేరకు త్వరలోనే గిరిజన సంఘాలను ఆహ్వానించి చర్చించనున్నారు. సమీక్షలో మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ నాయక్, డైరెక్టర్ సదా భార్గవి, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంతృప్తే ప్రభుత్వ శాఖల పనితీరుకు కొలమానం





- తక్కువ పనితీరుపై శాస్త్రీయ విశ్లేషణతో కార్యాచరణ నివేదిక ఇవ్వాలి
- ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచాలి
- పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**రంపచోడవరం, పెన్ పవర్, జూలై 20**: ప్రజల సంతృప్తే ప్రభుత్వ శాఖల పనితీరుకు ప్రధాన కొలమానమని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా నిర్వహించనున్న మెగా పేరెంట్--టీచర్ సమావేశం నేపథ్యంలో ప్రభుత్వ శాఖల పనితీరును ప్రజల అభిప్రాయాల ఆధారంగా సమీక్షించనున్నట్లు తెలిపారు.సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు ప్రతి శాఖ పనితీరును సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటామని చెప్పారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

తక్కువ పనితీరు నమోదైన అంశాలపై సాధారణ సమాధానాలు కాకుండా గణాంకాలు, ఆధారాలతో కూడిన శాస్త్రీయ విశ్లేషణ సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 24న తక్కువ పనితీరు కనబరిచిన శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది రంపచోడవరంలో ప్రత్యక్షంగా హాజరై పనితీరు, లోపాలకు గల కారణాలు, వాటి పరిష్కారానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను వివరించాలని సూచించారు.వైద్య ఆరోగ్య, రవాణా శాఖలు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. పెన్షన్ పంపిణీ, నిత్యావసర సరుకుల పంపిణీ, విద్యుత్ సరఫరా, అంగన్‌వాడీ సేవల్లో మరింత మెరుగుదల అవసరమని పేర్కొన్నారు.ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అందుతున్న అభిప్రాయాలను ప్రతి శాఖ క్షుణ్ణంగా విశ్లేషించి సేవల నాణ్యతను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ శాఖల ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.

# విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట





- గింజర్తిలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన
- 103 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌవ్‌ల పంపిణీ
- రాజవొమ్మంగి రామాలయం పేటలో వీధి దీపాల ప్రారంభం

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, జూలై 20:** విద్యా, పూర్వ ప్రాథమిక విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు.సోమవారం రాజవొమ్మంగి మండలంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత కమ్మరపేట రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వీధి దీపాలను ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో క్రాంతికుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 103 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టౌవ్‌లను పంపిణీ చేశారు.

ఇండక్షన్ స్టౌవ్‌ల వినియోగం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సకాలంలో, సౌకర్యవంతంగా పోషకాహారం అందించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం గింజర్తి గ్రామంలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా రూ.14.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన ప్రాథమిక పాఠశాల భవనానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను కూటమి నాయకులు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ్, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, టీడీపీ నాయకులు గణజాల తాతారావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎంఈవో కారం సత్యనారాయణ దొర, సీడీపీవో క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పర్యావరణ హిత గోదావరి పుష్కరాల నిర్వహణకు చర్యలు



రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జిల్లా కలెక్టర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 20:** గోదావరి పుష్కరాలను 2027 పర్యావరణ హిత పుష్కరాలుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతున్నామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు.

సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గోదావరి పుష్కరాల నిర్వహణ ఏర్పాటైన రాష్ట్రస్థాయి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిటీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు . పర్యావరణ పరిరక్షణ చర్యలతో గోదారి పుష్కరాలు నిర్వహించేందుకు జిల్లాలో చేపట్టిన కార్యాచరణలను వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి జలాలు పారిశ్రామిక వ్యర్థాలు, జనావాసాల మురుగు, ఘన వ్యర్థాలతో కలషితం కాకుండా నదీ పరివాహక పట్టణలు, గ్రామాల్లో వివిధ శాఖల సమన్వయంతో నియం త్రణ ఏర్పాటు చేస్తున్నామని కమిటికి తెలియ జేసారు. జిల్లాలో 17 రెడ్ కేటగిరి పరిశ్రమల నుండి వ్యర్థాలు వెలువడు తుండగా, వీటిలో రెండు పరిశ్రమల వ్యర్థాలు గోదావరి లోకి విడిచి పెడుతున్నాయన్నారు .ఈ పరిశ్రమలు తమ డిస్ఛార్జిలను నూరు శాతం ట్రీట్మెంట్ చేసేలా ఆదేశాలు జారీచేస్తామన్నారు. నది, కాలువలకు చేరువుగా ఉన్న గ్రామాలలో సీవరేజి ట్రీట్మెంట్ ప్లాంటులు, మాజిక్ డ్రైన్లు, సోక్ పిట్లు ఏర్పాటుకు ప్రతిపాదించా మన్నారు. గోదావరి, సాగు, త్రాగునీటి వ్యవస్థల కలుషితం కావడాన్ని నివారించేందుకు శాశ్వత పరిష్కారంగా రూ.300 కోట్ల అంచనాతో కాలుష్యాల తరలింపుకు డెడికేటెడ్ ఛానల్ ఏర్పాటకు ప్రతిపాదలతో డిపిఆర్ ను ప్రభుత్వ పరిశీలనకు సమర్పించడం జరిగిందన్నారు. రాజమండ్రి నగరం, కొవ్వూరు పట్టణల డ్రైన్ వాటర్ ను బారేజి దిగువకు తరలించే తాత్కాలిక మళ్లింపుకు ప్రతిపాదిస్తు న్నామని తెలిపారు. పుష్కరాల సందర్భంగా నది పొడవునా ఇరువైపులా అన్ని ఘాట్లలో నిరంతర వాటర్ క్వాలిటీ మోనిటరింగ్, అన్ని ఘాటలను ప్లాస్టిక్ రహిత ఘాట్లుగా నిర్వహించ నున్నామని తెలియ జేసారు. మునికూడలి ఘాట్ ను మోడల్ పుష్కర ఘాట్ గా తీర్చిదిద్దేందుకు ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయితీ, దేవాదాయ తదితర శాఖల తో చేపట్టిన పనులు ప్రారంభమైయ్యాయని కలెక్టర్ తెలియజేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం నగర కమీషనర్ రాహూల్ మీనా, పంచాయతీ, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, టూరిజం, పొల్యూషన్ కంట్రోల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్ లో 39 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , జూలై 20:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు.

పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 39 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ , కుటుంబ సమస్యల , చీటింగ్ , కొట్లాట ఇతర కేసుల ఫిర్యాదులు ఉన్నాయి.

## స్థానిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం పడిపోతుంది




- జగన్ 2.0 పోస్టర్ ఆవిష్కరణ
- వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జూలై 20:**స్థానిక సంస్థల ఎన్నికల తరువాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పడిపోతుందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ జోస్యం చెప్పారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లో వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మార్గాని భరత్ మాట్లాడుతూ, టీడీపీ నాయకుడు ఒక మహిళ ని వివస్త్రగా చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై జాతీయ మహిళా కమీషన్, మానవ హక్కుల కమీషన్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సుమోటోగా విచారణ జరిపించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అనాగరిక చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు తమ వైసిపిని గొడ్డలి పార్టీ అంటున్నారని ఎద్దేవా చేసారు. తాడేపల్లి ప్యాలెస్ అంటూ జగన్‌పై బురద జల్లుతున్నారని, హైదరాబాద్‌లో చంద్రబాబు ఇల్లు బకింగ్ హామ్ ప్యాలెస్‌ను తలపిస్తుంద న్నారు. అమరావతిలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు కడతామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ కాపు మనోభావాలు రెచ్చగొట్టి ఓట్లేయించుకున్నారని, జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తానని చంద్రబాబు ప్రజల్ని మోసం చేసారని ఆరోపించారు. 64 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, తిరిగి 2 వేల చొప్పున పాఠశాలల నిర్వహణకు వసూలు చేస్తున్నారని ఆ డబ్బు ఏమైందో చెప్పాలని డిమాండ్ చేసారు. అనంతరం జగన్ 2.0 పోస్టర్‌ను, ఈనెల 21వ తేదీన మోరంపూడి జంక్షన్‌లో చేపట్టే ఆందోళన కు సంబంధించిన పోస్టర్లను బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతీ ఒక్కరు ఈ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. మోరంపూడి ఫ్లైఓవర్‌ను వైసిపి పాలనలో తాము నిర్మాణం చేస్తే రెండేళ్లయినా సర్వీస్ రోడ్లు వేయలేక పోయారని మండిపడ్డారు. సర్వీసు రోడ్లు వేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మార్గాని నాగేశ్వరరావు, మార్తి లక్ష్మీ, పోలు విజయలక్ష్మి , ముప్పన ప్రభాకర్, మార్తి నాగేశ్వరరావు, , దాసి వెంకట్రావు, బిల్డర్ చిన్న, తిరగటి దుర్గారావు, అరె చిన్ని, దూర్వాసుల సత్యనారాయణ, కొండేటి సుధ, కట్టా వెంకటేష్, నల్లా రామాంజనేయులు , , , అనురాధ, అనంతలక్ష్మి, , , రేగుళ్ల శ్రీధర్, గుడాల ప్రసాద్, , గుత్తుల భాస్కర్, సయ్యద్ హసన్, మార్గాని రాము తదితరులు పాల్గొన్నారు.

## పిజీఆర్ఎస్ అమలు ను ప్రక్షాళన చేయాలి

- పిజీఆర్ఎస్ (స్పందన) లక్ష్యాన్ని నీరు గారుస్తున్న అధికార యంత్రాంగం
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ విమర్శ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 20**
భాదితులకు ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కోల్పోయే విధంగా అధికార యంత్రాంగం పనితీరు వుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ధ్వజ మెత్తారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం వట్టి బూటకంగా మారుతుందన్నారు. అర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.ఈ సభ లో మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ, భాదితులకు భరోసాగా నిలవాల్సిన పి జి ఆర్ ఎస్ పిర్యాదుల విభాగం పూర్తిగా వైఫల్యం చెంది ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. పిజిఆర్ఎస్ నిర్వహణ అవినీతి మయంగా మారిందని, ఉన్నత అధికారులకు తప్పుడు నివేదికలను పంపుతున్నా రన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో భాధ్యతలను నిర్వహించటం లేదన్నారు. పిజిఆర్ఎస్ వల్ల ప్రభుత్వ సమయం వృధా కావటం తప్ప భాదితులకు ఏ మాత్రం మేలు జరగటం లేదన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పిర్యాదులను వ్యాపారంగా మార్చుకుంటున్నారని . పిర్యాదుల సమాచారాన్ని అక్రమార్కులకు ముందుగా చేరవేస్తున్నరని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది భాధ్యతారాహిత్యం సామాజిక అరాచకానికి దారితీస్తుందని ఆవేదన చెందారు. భాదితుల సమస్య వినకుండానే, విచారణ జరుపకుండానే, విచారణ ప్రతులను ఇవ్వకుండానే సమస్యను పరిష్కరించినట్లు భాదితులకు ఆన్లైన్ సమాచారం తెలియచేస్తు అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి, బాధితులకు ఇరువర్గాలకు ఉపయోగం లేని ఈ కార్యక్రమం వల్ల విలువైన సమయం , స్టేషనరి, ప్రజాధనం వృధా అని ప్రజలు విమర్శిస్తున్నా రన్నారు. దిగువస్థాయి అధికారులు పిజిఆర్ఎస్ లో తప్పుడు పిర్యాదులు చేయిస్తున్నారని ఇటువంటి పిర్యాదులకు న్యాయం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

పోలీస్ – రెవిన్యూ విభాగాలకు వచ్చే పిర్యాదుదారుల పట్ల అధికారులు అహంకారంగా, నిర్లక్ష్యపు ధోరణిలో ప్రవర్తిస్తు భాదితులను వేదనకు గురిచేస్తున్నా రన్నారు. కొన్ని సందర్భాల్లో పిర్యాదు పిటిషన్లను ఉపసంహరించుకున్నట్లు బాధితుల సంతకాలను ఫోర్జరీ చేసి పై అధికారులకు తప్పుడు నివేదికలను పంపిస్తున్న ఘటనలు వున్నాయన్నారు. దిగువస్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యం పై ఉన్నతాధి కారుల వద్దకు, లేదా స్పందన విభాగానికి పిర్యాదు చేసినా ఈ రెండు విభాగాల్లోని ఉన్నత అధికారులు పట్టించు కోవడం లేదన్నారు. పోలీస్ – రెవిన్యూ విభాగాల్లో హక్కును పొందాలంటే లంచాలు వెదచల్లాలన్నారన్నారు.

పి జి ఆర్ ఎస్ పౌర సేవలకు మెరుగైన మార్గం అయినప్పటికి అవినీతిని కట్టడి చేయనంత కాలం, దుర్వినియోగ అధికారులు, ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు చేపట్టనంత వరకు సుపరిపాలన సాధ్యం కాదన్నారు. ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కోల్పోక ముందే లోప భూయిష్ట పాలన విదానాలను సంస్కరించా లని, పిజిఆర్ఎస్ అమలు తీరులో ప్రక్షాళన జరపాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సిమ్మా దుర్గారావు , దుడ్డే త్రినాద్ , వర్ధనపు శరత్ కుమార్, , బసా సోనియా , మేకల కిరణ్, కందివలస రమణ , చల్లావంశీ , వాడపల్లి జ్యోతిష్ , అడపా శేషగిరి , మట్టపర్తి తులసి , నున్న గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల్లో ఎస్ సి,ఎస్ టి,బి సి లకు భాగస్వామ్యం కల్పించాలి

**జిల్లా కలెక్టరేట్ లో పి జి ఆర్ ఎస్ లో బిజెపి వినతి పత్రం**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 20:**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్.మాధవ్ పిలుపుమేరకు జనతా వారధి కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో
ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో ఎస్ సి, ఎస్ టి, బి సి వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్లో సోమవారం జరిగిన పిజి ఆర్ ఎస్ లో వినతి పత్రం అందజేశారు. పారిశ్రామిక యాజమాన్య అవకాశాలు, ఉపాధి కల్పించే విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆ వినతి పత్రం లో కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి సూర్య కిరణ్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్ చింతాలమ్మ సిద్ధాంతి వెంకట్ ,జిల్లా బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వెలుపల జనతా వారధి కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం పారిశ్రామికా భివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఇటీవల 8 ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు మొత్తం 4,196.55 ఎకరాల భూమిని కేటాయించింద న్నారు. సుమారు రూ.1,720.88 కోట్ల పెట్టుబడులు, 1.72 లక్షలకుపైగా ఉపాధి అవకాశాలు కల్పించే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర వ్యాప్తంగా 50వేల ఎకరాల భూమికి మరొక లక్ష ఎకరాల సేకరణకు ఆలోచన చేయడం అభినందనీయమన్నారు.

తూ గో జిల్లా మరింత ప్రధాన్యం కల్పించాలని, ప్రభుత్వం కేటాయిస్తున్న భూములు ప్రజల ఆస్తి ఈ భూముల ద్వారా ఏర్పడే పారిశ్రామికాభివృద్ధి ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరేలా ప్రభుత్వం విధానాలు రూపొందిం చాల్సిన బాధ్యత ఉందన్నారు.రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలు వర్గాలు ఇప్పటికీ పారిశ్రామిక యాజమాన్యంలో, పెద్ద పెట్టుబడుల్లో, పరిశ్రమల స్థాపనలో తగిన స్థాయిలో భాగస్వామ్యం పొందలేక పోయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్టాండ్-అప్ ఇండియా, పి ఎం ఇ జి పి, ఎం ఎస్ ఎం ఈ ప్రోత్సాహ కాలు, మూలధన సబ్సిడీలు, వడ్డీ రాయితీలు, ఎస్ సి ఎస్ టి బి సి ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయం వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో కూడా ఈ సామాజిక న్యాయ సూత్రాలు తప్పనిసరిగా అమలయ్యేలా ప్రభుత్వం స్పష్టమైన విధానపర నిర్ణయాలు తీసుకోవా లన్నారు.

ఆంధ్రప్రదేశ్ లో 70 శాతం పైగా ఉన్న ఈ మూడు వర్గాలు పారిశ్రామిక రంగంలో 20 శాతం కూడా లేకపోవడం శోచనీయమ న్నారు. ప్రభుత్వ భూములు పొందిన ప్రతి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో ఎస్ సి ఎస్ టి బి సి పారిశ్రామికవేత్తలకు పారిశ్రామిక ప్లాట్లు/షెడ్లు కేటాయించేందుకు ప్రత్యేక విధానం రూపొందిం చాలన్నారు.
.

పెద్ద పరిశ్రమలు తమ సరఫరా గొలుసులో ఈ వర్గాల యాజమాన్యం లోని ఎం ఎస్ ఎం ఈ యూనిట్ల నుండి నిర్దిష్ట శాతం కొనుగోళ్లు చేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. పెద్ద కంపెనీలు ఈ వర్గాల పారిశ్రామికవేత్తలతో జాయింట్ వెంచర్స్, అనుబంధ యూనిట్లు ఏర్పాటు చేస్తే అదనపు ప్రోత్సాహకాలు , ప్రాధాన్యం కల్పించా లన్నారు. ఎస్ సి ఎస్ టి బి సి పారిశ్రామికవేత్తలకు భూమి ధరలో రాయితీ, మూలధన సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, విద్యుత్ రాయితీలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, బ్యాంకు రుణాలకు ప్రభుత్వ హామీ వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలన్నారు.

ప్రైవేట్ పార్కుల్లో ఈ వర్గాల మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక అవకాశాలు, శిక్షణ, రాయితీలు కల్పించాలన్నారు..

ఈ విధానాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, అందులో ఎస్ సి ఎస్ టి బి సి వర్గాల ప్రతినిధులకు అవకాశం కల్పించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుడు మృతి

- రూ.20 వేల ఆర్థిక సాయం అందించిన పీడీవో



**పెన్ పవర్ । ఉంగుటూరు । జూలై 20:**బాదంపూడి స్వర్ణ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మర్రి ప్రభాకరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నెల 18న బాదంపూడి పెట్రోలు బంక్ సమీపంలో బైక్‌పై వెళుతుండగా ప్రమాదానికి గురైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.
ఈ సందర్భంగా బాదంపూడి పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీవో) కాకర్ల వెంకట గిరిధర్ మానవతా దృక్పథంతో తన సొంత నిధుల నుంచి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే, ప్రభాకరరావు కుటుంబంలో ఒకరికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 18 అర్జీలు

- అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 20:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజల సంతృప్తిని మెరుగుపరిచే దిశగా నిర్వహించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుంచి 18 అర్జీలు స్వీకరించారు . వీటిలో ఇంజనీరింగ్ కి 4, రెవెన్యూకి 1, టౌన్ ప్లానింగ్ కి 5, పబ్లిక్ హెల్త్ కి 3, అకౌంట్స్ విభాగానికి 1, వార్డు సచివాలయాలకు సంబంధించి 4 ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ లో వచ్చే అర్జీలను నిబంధనలకు అనుగుణంగా మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిశీలించి పరిష్కరిస్తేనే అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తారన్నారు. . ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 33వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 20 :**స్థానిక 33వ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా లక్ష్మీవారపుపేట శివాలయం వీధి లో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 100 కేవీ డీటీఆర్‌గా అప్‌గ్రేడ్ చేయాగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారంప్రారంభించారు. అనంతరం రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు లో వోల్టేజ్ సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల విజ్ఞప్తికి వెంటనే స్పందించి వారం రోజుల్లోనే 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను 100 కేవీగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని చెప్పారు. సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. శివాలయం వెనుక ఉన్న డ్రైనేజీ సమస్యతో పాటు బుద్ధుడు ఆసుపత్రి నుంచి స్వర్ణ మంజరి జ్యువెలరీ వరకు ప్రధాన డ్రైనేజీ అధ్వాన్నంగా ఉండటంతో రూ.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎరుకలవారి వీధి -- భక్తులరాజు వీధి రహదారి అభివృద్ధికి రూ.11.50 లక్షలు మంజూరయ్యాయని, వచ్చే రెండు నెలల్లో పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. లక్ష్మీవారపుపేట శివాలయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఆలయ కమిటీ, భక్తులతో సమావేశమై జరుగుతున్న పనులను సమీక్షించి వారి సూచనలను తీసుకుంటామని చెప్పారు. పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. నగరంలో పుష్కరాల నేపథ్యంలో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు రూ.140 కోట్లు ఆమోదం పొందాయని, త్వరలోనే పనులు ప్రారంభించి నగ రాన్ని ఆరోగ్యకర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## సుమధుర గాన సరస్వతి యస్ జానకి కి నివాళి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూలై 20:**జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా తరపున ఇటీవల దివంగతులైన సుమధుర గాయనీ మణులు ఆశా భోంస్లే, సుమన్ కళ్యాణ్ పూరీ, యస్ జానకి కి స్వర నివాళి కార్యక్రమం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదిక లో జరిగింది. ఈ కార్యక్రమానికి నట గాయకుడు పాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షత వహించారు . ముఖ్య అతిథులుగా పివియస్ కృష్ణారావు, జల్లి శివ ప్రసాద్, వి.జగపతి, డా. గిరజాల సోమరాజు నాయుడు, సుక్కిరెడ్డి శ్రీనివాస్, బి.సీతా రామారావు, డి.యస్. శ్రీనివాస్, పాల్గొన్నారు. ఉప్పులూరి చిన్నారావు దంపతులు జ్యోతి ప్రకాశనం చేయగా డా. గిరజాల సోమరాజు నాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించి వందన సమర్పణ చేశారు. వక్తలు మాట్లాడుతూ భారతీయ సినిమా సంగీత ప్రపంచంలో ఆశా భోంస్లే , సుమన్ కళ్యాణ్ పూరీ, యస్ జానకి లు తమ గానామృతంతో వేలాది పాటలు పాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని, వారి పాటలతో చిరంజీవులు గా ఉంటారని కొనియాడుతూ నివాళులు అర్పించారు. జిత్ ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు డా.వంక బాలకృష్ణ, మంగళంపల్లి సూర్య కుమారి,డా.సిహెచ్.శ్రీనివాస్, విశ్వనాథ్, డా.హేమా నళిని , డా.రమేష్, డా.హరి, జి.లక్ష్మీతులసి, రేవతి, పలు పాటలు పాడి స్వర నివాళులు అర్పించారు, ఆర్కెస్ట్రా గాయనీ మణులు డా.హేమా నళిని, సూర్య కుమారి, జి.లక్ష్మితులసి, రేవతి లను సంస్థ తరపున చిరు సత్కారం చేసి అభినందనలు తెలిపారు. నాగేంద్ర, సూర్య సిద్ధాంతి, పిచ్చుక మహేష్,సామ్రాట్ అక్కినేని, ఎ.కృష్ణ శర్మ, టి.నూకరాజు, గుమ్మడి రాజు, శ్రీపాద శంకర రావు, ఎమ్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లో 246 అర్జీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 20 :**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లో ఫిర్యాదులకు వాస్తవ పరిష్కారం లభించిన తర్వాత మాత్రమే వాటిని పరిష్కరించినట్లుగా నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ , రెవెన్యూ క్లినిక్ లో ప్రజల నుంచి 246 అర్జీలు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారు లను ఆదేశించారు.
పీజీఆర్ఎస్ వారాంతపు ప్రతిపాదనలు పంపడం , సాధారణ సమాధానాలతో ఫిర్యాదులను మూసివేయ కుండా, సమస్య పూర్తయిన తర్వాత మాత్రమే పరిష్కరించినట్లు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్య పరిష్కార స్థితిని వివరించాలని, పత్రాధారాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రజలకు జవాబుదారీ తనంతో పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి శాఖ ప్రజల సంతృప్తిని పెంపొందించేలా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె. ఆనందరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ఆర్.ఆర్. ప్రేమ్ కుమార్, పి. భాగ్యలక్ష్మి, సీపీఓ ఎల్. అప్పలకొండ, డీఎల్‌డీవో పి. వీణాదేవి, జిల్లా సర్వే అధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ డా. కోమలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

- గ్రీవెన్స్‌లో 159.. రెవెన్యూ క్లినిక్‌లో 20 దరఖాస్తులు



**రంపచోడవరం, పెన్ పవర్, జూలై 20**: మారుమూల గ్రామాల ప్రజలు సమర్పించే సమస్యల దరఖాస్తులను స్వీకరించి, సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించడంతో పాటు మిగిలిన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిస్తామని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్), రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌కు 159 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 20 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.గుర్తేడు మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని, దేవీపట్నం మండలం డి.ఎన్.పాలెంలో ఆర్ఎస్‌కే కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని, రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు డైనింగ్ హాల్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని ప్రజలు వినతులు సమర్పించారు.అలాగే రంపచోడవరం మండలం బోలకొండ గ్రామంలో రహదారికి రెండు కాలువలను అనుసంధానం చేయాలని, ఏటపాక మండలం పురుషోత్తపట్నం పంచాయతీ శ్రీరామ్‌నగర్‌లో 15 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని పలువురు దరఖాస్తులు సమర్పించారు.
కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీర్లు, తహసీల్దార్లు, ఐటీడీఏ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యం







**- ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 20:** స్థానిక పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన "షైనింగ్ స్టార్స్--2026" కార్యక్రమం లో ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘనంగా సన్మానం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు మాట్లాడుతూ విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మౌలిక వసతులు, తరగతి గదుల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. విద్యా ఫలితాల్లో బాలికలు ప్రతిభ కనబరుస్తున్నారని, బాలురు కూడా వారితో పోటీపడి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను జీవన విధానంగా అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.
జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు.
మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ , ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించడం సంతోషకర మన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని కొనియాడారు. అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ మాట్లాడుతూ కృషి, సాధన, పట్టుదల ఫలితంగానే విద్యార్థులు ఈ గౌరవాన్ని అందుకున్నారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.జిల్లా విద్యాశాఖ అధికారి కే. వాసుదేవరావు విద్యాశాఖ నివేదికను సమర్పిస్తూ, పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 142 మంది విద్యార్థులను జిల్లా స్థాయి "షైనింగ్ స్టార్స్--ప్రతిభా అవార్డులకు" ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో ఓసీ 54 మంది, బీసీ 47 మంది , ఎస్టీ 19 మంది , ఎస్సీ 19 మంది , సీడబ్ల్యూఎస్ఎన్ 3 మంది ఉన్నారని వివరించారు. బాలికలు 83 మంది, బాలురు 59 మంది ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా పరిధిలోని 22 మండలాల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణ మన్నారు. నల్లజర్ల, రాజమహేంద్రవరం (రూరల్) మండలాల నుంచి అత్యధికంగా తొమ్మిది మంది చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిణి ఐ . శారద మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 43 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు.
అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, ఆదిత్య శర్మలు పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన 142 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన 43 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందజేసి ఘనంగా సత్కరించారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు...**

విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తి, భారతీయ సంస్కృతి, విద్య ప్రాధాన్యతను ప్రతిబింబించే నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఆదరణ పొందింది. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు.
కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు






- ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలే శరణ్యం
- రంపచోడవరంలో విజయవంతమైన ఆదివాసీ మహాగర్జన
- వేలాదిగా తరలివచ్చిన గిరిజనులు.. హక్కుల పరిరక్షణకు నినాదాలు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 20:** ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలే శరణ్యమని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్బంధాలు, అడ్డంకులు సృష్టించినా గిరిజనుల ఉద్యమాలను అడ్డుకోలేరని హెచ్చరించారు. జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంపచోడవరంలో నిర్వహించిన ఆదివాసీ మహాగర్జన విజయవంతమైంది.
ఆదివాసీ మహాగర్జనకు గిరిజనులు రాకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేసి అడ్డంకులు సృష్టించినప్పటికీ, వేలాది మంది గిరిజనులు రంపచోడవరం చేరుకున్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ర్యాలీ పీఎంఆర్సీ నుంచి ప్రారంభమై అంబేద్కర్ కూడలి మీదుగా స్టేట్ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంది. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు అనుకూలంగా చేసిన నినాదాలతో రంపచోడవరం మార్మోగింది.సభకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అధ్యక్షత వహించగా, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకుడు కంగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3, 1/70 చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జీవో నంబర్ 3ను పునరుద్ధరించి, ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీలోని ఉద్యోగాలను గిరిజనులకే కేటాయించాలని కోరారు.సుప్రీంకోర్టులో నాన్-ట్రైబల్స్ దాఖలు చేసిన అప్పీళ్లపై ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని, లేకపోతే గిరిజనుల రాజ్యాంగ హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. భూ హక్కులు, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంతో పాటు అటవీ హక్కుల చట్టం కింద అర్హులైన గిరిజనులందరికీ వెంటనే భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నెల 24న ముఖ్యమంత్రి రంపచోడవరం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో గిరిజనుల ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని నాయకులు కోరారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై నిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టడం ద్వారా ఉద్యమాలను అణచలేరన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామసభలు, పీసా గ్రామ కమిటీల తీర్మానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ అభివృద్ధికి ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలని, గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు కోరారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఏజెన్సీ వ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.
అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, తదుపరి ఉద్యమాన్ని ప్రకటించాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నిర్ణయించింది.
కార్యక్రమంలో కంగల శ్రీనివాస్, కత్తుల ఆదిరెడ్డి, కుంజా అనిల్, వెదుళ్ల లచ్చిరెడ్డి, ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, పల్లాల లింగారెడ్డి, పులి సంతోష్, మడివి రవితేజ, పండా సిద్ధార్థ, తెల్లం శేఖర్, బొప్పెన కిరణ్, బోండ్ల వరప్రసాద్, బుసరి బాలరాజు, తీగల బాబురావు, మట్ల వాణిశ్రీ, టి.శ్రీను, వంతు బాలకృష్ణ తదితరులతో పాటు వేలాది మంది గిరిజనులు, మహిళలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ద్వారకాతిరుమలలో పోలీసుల ఆధ్వర్యంలో శక్తి యాప్, చట్టాలపై అవగాహన సదస్సు



**పెన్ పవర్ । ద్వారకాతిరుమల । జూలై 20**

ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ టి. సుధీర్ ఆధ్వర్యంలో ప్రజలకు, ముఖ్యంగా మహిళల భద్రత, రక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు.
ఈ సందర్భంగా శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరిస్తూ, మొబైల్‌లో యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వినియోగించుకోవాలో పోలీసులు ప్రత్యక్షంగా చూపించారు. ఆపద సమయంలో మహిళలు తక్షణ సాయం పొందేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.
అలాగే, కొత్తగా అమల్లోకి వచ్చిన లిలిభారతీయ న్యాయ సంహితలోని ముఖ్యమైన నిబంధనలు, సెక్షన్లపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెరిగితేనే నేరాలను నివారించడం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్ఐ సుధీర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా ఆలకించారు.

# ద్వారకాతిరుమల శ్రీ స్వామివారి శాశ్వత అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



**పెన్ పవర్ । ద్వారకాతిరుమల । జూలై 20**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి శాశ్వత అన్నదాన ట్రస్టుకు తణుకు వాస్తవ్యులు పి. వెంకటేశ్వరరావు, నాగసుధ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ ఐ.వి. రామారావు వారి నుంచి విరాళాన్ని స్వీకరించి, దాతలకు విరాళ రసీదు (బాండ్)ను అందజేశారు. శ్రీ స్వామివారి నిత్యాన్నదాన సేవలో భాగస్వాములైన దాతలను ఆలయ అధికారులు అభినందించి, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# కలెక్టర్ చే షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 20;**
మండలంలోని పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డు లు అందుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కే శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఏలూరులో సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా కలెక్టర్ కె వేత్రి సెల్వి చేతుల మీదుగా అవార్డులు పొందినవిద్యార్థులు సాయి వైష్ణవి, కొత్తూరు వైష్ణవి, మిడత అనిల్ కుమార్, రేగుంట ప్రవీణ, దూదేకుల హఫీజ, పద్దం అనిత, సోదెం
దేవి శ్రీ ప్రశంసా పత్రాన్ని నగదు ప్రోత్సాహాన్ని బహుమతులు అందుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.

జీలుగుమిల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో పదో తరగతి చదివిన కొత్తూరు వైష్ణవి, దూదేకుల హఫీజ్, వంక వారి గూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం లో చదివిన సాయి వైష్ణవి, ములుగులంపల్లి హై స్కూల్ విద్యార్థి మిడత అనిల్ కుమార్, దర్భ గూడెం గ్రామంలోని సెయింట్ పీటర్ అండ్ పౌలు ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో చదివిన విద్యార్థి రేగుంట ప్రవీణ, అంకన్నగూడెం గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన సోదెం దేవి శ్రీ, పద్దం అనిత బహుమతులను పొందారు.అవార్డులు పొందిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ,అభినందనలు తెలిపారు.



## మత్తుకు బానిసవ్వద్దు -- ఆరోగ్యాన్ని చిత్తు చేసుకోవద్దు..



**సీతానగరం, పెన్ పవర్, జూలై 20:**మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ అన్నారు.
మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల,లో విద్యార్థిని, విద్యార్థులకు గంజాయి పరివర్తన కార్యక్రమంలో భాగంగా మహిళలపై జరిగే అత్యాచారాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసై వారి వారి ఆరోగ్యాన్ని చిత్తు చేసుకుంటున్నారని చెప్పారు. అనేక మంది యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసై వారి బంగారు భవిష్యత్తుతో పాటు వారి వారి కుటుంబాన్ని కూడా దూరంగా ఉండి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి పండించడంతోపాటు సేవించడం కూడా నేరమని, గంజాయి రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠినమైన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్క యువత చెడు మార్గాలు వదిలేసి సన్మార్గంలో నడిచి వారు బంగారు భవిష్యత్తును వారి ఎంచుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లితండ్రుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. నేటి సమాజంలో మహిళలపై జరిగే అత్యాచారాలు, సైబర్ నేరల గురించి పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రీను నాయక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై హత్యాయత్నం భర్తకు 14 రోజులు రిమాండ్

**సీతానగరం, పెన్ పవర్, జూలై 20:**భార్యను వేధించి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను అరెస్టు చేసి పోలీసులు రిమాండ్ కు తరలించారు. సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ సోమవారం సాయంత్రం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.
మండలంలోని అచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన పంది కృష్ణవేణి సీతారామును 13 సంవత్సరాల క్రితం ఇద్దరు వివాహం చేసుకున్నారు. వీరికి ఒక అమ్మాయి అబ్బాయి పిల్లలు ఉన్నారు.అయితే భర్త కొంతకాలంగా మద్యం తాగి ఉన్న ఇల్లును కూడా ప్రైవేట్ బ్యాంకులో అప్పు తెచ్చి ఆ అప్పు కట్టకపోవడంతోటి ప్రైవేటు బ్యాంకు వాళ్లు ఇల్లు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. భార్యను కాపురానికి రమ్మనికొరగా ఈనెల 18వ తేదీన నిరాకరించడంతో ఇంట్లో వంట పని చేస్తుండగా వెనక నుండి వచ్చిన భర్త సీతారాము ఆమె వద్దకు వెళ్లి జుట్టు పట్టుకుని మెడను కట్ చేయడానికి ప్రయత్నించగా తప్పించుకుంది. అయినా కుడి చెయ్యి పై భాగంలో తగిలి తీవ్రంగా రక్తం గాయం అయింది. ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడైన సీతారామను కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు ఎదుట వారిని కించపరుస్తూ శాంతి భద్రతకు విగాదం కలిగించేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టడం ఇతర మాధ్యమాలలో పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ హెచ్చరించారు. ఎదుట వారిని రెచ్చగొట్టే పనులు చేయకుండా అలా చేయమని ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ఎల్ శ్రీను నాయక్ తెలిపారు.

## తేనె పట్టు కోసం చెట్టెక్కిన యువకుడిపై తేనె తుట్టెల దాడి...



**అక్కడికక్కడే మృతి**

**కూనవరం,పెన్ పవర్,జూలై 20.**పోలవరం జిల్లా కూనవరం మండలం గండి కొత్తగూడెం గ్రామానికి చెందిన పోడియం భద్రయ్య(33) తేనె పట్టు కోసం కొండపైకి వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు.ఆదివారం ఉదయం 11 గంటలకు స్నేహితులతో కలిసి వేటకు వెళ్లిన భద్రయ్య చెట్టెక్కి తేనె పట్టు తీస్తుండగా తేనె తుట్టెలు మూకుమ్మడిగా దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన భద్రయ్య అక్కడికక్కడే మరణించాడు. స్నేహితుడు సతీష్ సమాచారంతో గ్రామస్తులు రాత్రి 11గంటలకు శవాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు శవాన్ని కోతులుగుట్ట ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు.కేసు నమోదు చేసి ఎస్ఐ బి.రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు

## మత్తుకు బానిసవ్వద్దు -- ఆరోగ్యాన్ని చిత్తు చేసుకోవద్దు..







**సీతానగరం, పెన్ పవర్, జూలై 20:**మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీతానగరం ఎస్సై ఎల్. శ్రీను నాయక్ అన్నారు.
మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల,లో విద్యార్థిని, విద్యార్థులకు గంజాయి పరివర్తన కార్యక్రమంలో భాగంగా మహిళలపై జరిగే అత్యాచారాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసై వారి వారి ఆరోగ్యాన్ని చిత్తు చేసుకుంటున్నారని చెప్పారు. అనేక మంది యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసై వారి బంగారు భవిష్యత్తుతో పాటు వారి వారి కుటుంబాన్ని కూడా దూరంగా ఉండి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి పండించడంతోపాటు సేవించడం కూడా నేరమని, గంజాయి రవాణా చేయడం కూడా చట్టరీత్యా నేరమని అటువంటి వారిపై కఠినమైన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్క యువత చెడు మార్గాలు వదిలేసి సన్మార్గంలో నడిచి వారు బంగారు భవిష్యత్తును వారి ఎంచుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లితండ్రుల ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. నేటి సమాజంలో మహిళలపై జరిగే అత్యాచారాలు, సైబర్ నేరల గురించి పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రీను నాయక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విజేతలో ఎస్.పి.ఎల్ ఎన్నికలు





**తాళ్లపూడి, పెన్ పవర్, జూలై 20:**తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్లో సోమవారం ఎస్.పి.ఎల్ ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్య భారత దేశంలో ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా ఏ విధంగా నిర్వహిస్తారో అదే మాదిరిగా ప్రధానోపాధ్యాయులు డా.జె.వి.ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నలుగురు విద్యార్థులు ఎస్.పి.ఎల్ ఎన్నికలో నామినేషన్ దాఖలు చేసి, వారికి కేటాయించిన గుర్తులతో ప్రచారం నిర్వహించగా, పోలింగ్ రోజైన సోమవారం నాడు విద్యార్థులు తమ తమ ఓటర్ కార్డుతో వరుసగా వచ్చి ఎన్నికలో పాల్గొని, తమకు నచ్చిన అభ్యర్థికి ఓట్ వేశారు. విద్యార్థులే పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో 85 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పోటీ చేసిన 4 గురు విద్యార్థులలో 9వ తరగతి విద్యార్థి ఊసా వీరబాబు 57 ఓట్లు సాధించి ఎస్.పి.ఎల్ గా ప్రమాణ స్వీకారం చేసాడు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుండి అలవాటు చేసుకోవాలని, గెలుపు ఓటమి లను సమానంగా స్వీకరించే స్వభావాన్ని ఈ ఎన్నికల ద్వారా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వం ద్వారా 5 లక్షల రూపాయల బీమా చెక్కు అందజేత





**కొవ్వూరు, పెన్ పవర్, జులై 20:**కొవ్వూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తాళ్లపూడి మండలం, గజ్జరం గ్రామానికి చెందిన చాపర్ల హనుమంతరావు యాక్సిడెంట్ కు గురై మృతిచెందగా, వారి కుటుంబానికి టీడీపీ సభ్యత్వ బీమా పథకం కింద మంజూరైన రూ.5 లక్షల బీమా పత్రాన్ని, నామినీ అయిన చాపర్ల సత్యనారాయణకు కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. అదేవిధంగా కొవ్వూరు పట్టణానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 1,20,000 విలువగల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, సభ్యత్వ బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం పార్టీ బాధ్యతగా భావిస్తోందన్నారు. దివంగత చాపర్ల హనుమంతరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ బీమా సాయం వారి కుటుంబానికి కొంతైనా ఊరటనిస్తుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం. తనిఖీలు భద్రత కోసమే

**ఏ ఎస్పీ బొడ్డు హేమంత్**

**చింతూరు పెన్ పవర్, జులై 20:**చింతూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీలు చేపట్టిన ధర్నా ఘటన నేపథ్యంలో చింతూరు ఏ ఎస్పీ బొడ్డు హేమంత్ స్పందించారు. రంపచోడవరం గిరిజన మహాసభకు వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహించలేదని ఆయన స్పష్టం చేశారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టే సాధారణ తనిఖీల్లో భాగంగానే ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు పది కమర్షియల్ గూడ్స్ వాహనాలను తనిఖీ చేయగా, కొన్ని వాహనాల్లో 20 నుంచి 50 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఘాట్ రోడ్లలో గూడ్స్ వాహనాల్లో అధిక సంఖ్యలో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. మూడు వారాల క్రితం కాకినాడ నుంచి భద్రాచలం వెళ్తున్న బొలెరో పికప్ వాహనంలో 26 మంది ప్రయాణిస్తుండగా ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదాన్ని గుర్తు చేసిన ఏ ఎస్పీ, అలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. సభలు, సమావేశాలకు వెళ్లడాన్ని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవడం లేదని స్పష్టం చేసిన ఆయన, గూడ్స్ వాహనాల్లో ప్రయాణించకుండా ఉండాలని, ప్రయాణికుల వాహనాల్లో కూడా నిర్ణీత సామర్థ్యానికి మించి ఎక్కవద్దని ప్రజలకు సూచించారు. మీ ప్రాణ భద్రతే మా మొదటి ప్రాధాన్యం. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించండి అని చింతూరు ఏ ఎస్పీ బొడ్డు హేమంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మాస్ మహారాజా కొత్త లవ్ స్టోరీ... ఆ హీరోయిన్ తో రొమాన్స్ ఫిక్స్!



అక్షర గౌడ ఫ్యాషన్ సీక్రెట్స్





అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

టాలీవుడ్‌లో సరికొత్త మల్టీస్టారర్ కాంబినేషన్లకు ఎప్పుడూ విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద తనదైన మాస్ ఎనర్జీతో దూసుకుపోయే 'మాస్ మహారాజా' రవితేజ, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో అలరించే హీరో శ్రీవిష్ణు కలయికలో ఓ భారీ హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపుదిద్దుకోబోతోంది. అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మాణంలో, టాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి తెరకెక్కించనున్న ఈ సినిమా గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక సెన్సేషనల్ న్యూస్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ క్రేజీ మల్టీస్టారర్‌లో రవితేజ సరసన జోడీగా నటించబోయే హీరోయిన్ ఎవరనే సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఆ వివరాలు చూద్దాం..

**మలయాళ ముద్దుగుమ్మతో మాస్ మహారాజా రొమాన్స్:**

ఈ మోస్ట్ అవైటెడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రవితేజ సరసన కథానాయికగా మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ ఎంపికైనట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక, తన గ్లామర్ మరియు యాక్టింగ్ స్కిల్స్‌తో సౌత్ ఇండియాలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఈ సరికొత్త కాంబో వెండితెరపై సరికొత్త రొమాంటిక్ మ్యాజిక్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

**హసిత్ గోలి మార్క్ వినోదం - క్రేజీ టైటిల్స్:**

'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి విభిన్నమైన పూర్తి వినోదాత్మక చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న హసిత్ గోలి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను హ్యాండిల్ చేస్తున్నారు. రవితేజ మాస్ క్రేజ్‌ను, శ్రీవిష్ణు సెటిల్డ్ కామెడీ టైమింగ్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తూ ఆయన ఒక అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను దిల్ రాజు తన 'శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

**2027 సంక్రాంతి బరిలో నవ్వుల జాతర:**

ఈ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా టార్గెట్ చేస్తూ, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. సంక్రాంతి సీజన్ అంటేనే ఫ్యామిలీస్ అన్నీ థియేటర్లకు క్యూ కడతాయి. అలాంటి టైమ్‌లో రవితేజ, శ్రీవిష్ణు కలిసి ఒకే ఫ్రేమ్‌లో కడుపుబ్బా నవ్వించడానికి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగ గ్యారెంటీ అనే చర్చ అప్పుడే మొదలైంది. మాళవిక మోహనన్ గ్లామర్ కూడా తోడవ్వడం ఈ పండుగ వినోదానికి మరింత ప్లస్ కానుంది. రవితేజ, శ్రీవిష్ణు, హసిత్ గోలి, దిల్ రాజు.. ఇలా క్రేజీ టాలెంట్ అంతా ఒకే చోట చేరి సృష్టిస్తున్న ఈ సినిమా టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్ సెట్ చేయబోతోంది. మాస్ మహారాజా పక్కన మాళవిక మోహనన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతోందో చూడాలనే కుతూహలం అందరిలోనూ ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు మరియు హీరోయిన్ ఎంపికకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. మరి 2027 సంక్రాంతి బరిలో రాబోతున్న ఈ 'వీరాధివీరులు' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డుల సంచలనం సృష్టిస్తారో చూడాలి.

## అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే... పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు

- ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస
- తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్
- భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ
- కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు."2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు.దఅయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 2-1 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.

## ఓటమిని జీర్ణించుకోలేకపోయారా?.. అర్జెంటీనా ప్రవర్తన సిగ్గుచేటంటున్న ఫుట్‌బాల్ ప్రపంచం!

- ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై స్పెయిన్ విజయం
- ట్రోఫీ వేడుకలో స్పెయిన్‌ను అవమానించిన అర్జెంటీనా ఆటగాళ్లు
- ట్రోఫీ వేడుకకు వీపు చూపిన మెస్సీ సేన.. ఇది సిగ్గుచేటన్న విశ్లేషకులు
- గోల్డెన్ బాల్ అవార్డు సమయంలో మెస్సీ పేరుతో అభిమానుల నినాదాలు
- మ్యాచ్‌లో, ఆ తర్వాత ఇద్దరు అర్జెంటీనా ఆటగాళ్లకు రెడ్ కార్డులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. నిన్న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. అయితే, మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద దుమారం రేపాయి. అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానుల ప్రవర్తన సంస్కారహీనంగా ఉందని, క్రీడాస్ఫూర్తికి మాయని మచ్చ తెచ్చిందని పలువురు విశ్లేషకులు మండిపడుతున్నారు.మ్యాచ్ ముగిసిన తర్వాత రన్నరప్ పతకాలు అందుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు, కొత్త ఛాంపియన్లను అభినందించకుండా మైదానం నుంచి వెళ్లిపోయారు. స్పెయిన్ జట్టు ట్రోఫీని స్వీకరించేందుకు సిద్ధమవుతుండగా, లియోనెల్ మెస్సీ సహా అర్జెంటీనా ఆటగాళ్లందరూ మైదానంలో మరోవైపుకు వెళ్లి వీపు చూపిస్తూ నిలబడ్డారు. అంతకుముందు అర్జెంటీనా పతకాలు అందుకుంటున్నప్పుడు స్పెయిన్ ఆటగాళ్లు చప్పట్లతో అభినందనలు తెలిపినా, అర్జెంటీనా మాత్రం ఆ గౌరవాన్ని తిరిగి ఇవ్వలేదు. ఇది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.ఇక, టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ రోడ్రి 'గోల్డెన్ బాల్' అవార్డు అందుకుంటున్నప్పుడు స్టేడియంలోని అర్జెంటీనా అభిమానులు 'మెస్సీ, మెస్సీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ పరిణామం అక్కడి వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ ఘటనలపై +శ్మీశ్రీ.ఎశీఎ కథనం ప్రకారం.. టాక్‌స్పోర్ట్ బ్రాడ్‌కాస్టర్ అడ్రియన్ దర్హమ్ తీవ్రంగా స్పందించారు. "వారిలో కనీస సంస్కారం లేదు. ఈ రోజు వారు సిగ్గుపడే రీతిలో ప్రవర్తించారు. ఫైనల్లో ఓటమిని వారు అంగీకరించలేకపోతున్నారు. అర్జెంటీనా జట్టు ఈ ఆటకు, ప్రపంచకప్‌కు పూర్తి అవమానం" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

"ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత సులువైన గ్రూప్‌లో డ్రా పొంది, నాకౌట్ దశలో కష్టపడి గెలిచి, ఇక్కడికొచ్చి తమను తాము అవమానించుకున్నారు" అని దర్హమ్ వ్యాఖ్యానించారు. టోర్నీ ఆద్యంతం అర్జెంటీనాకు అనుకూలంగా అనేక నిర్ణయాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. నిజానికి ఫైనల్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లలో అసహనం కట్టలు తెంచుకుంది. దాంతో స్పెయిన్ ఆటగాళ్లపై దురుసుగా ప్రవర్తించారు. స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగినందుకు లియాండ్రో పరేడెస్‌కు రెడ్ కార్డ్ చూపించారు. అంతకుముందు ఆట అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ కూడా రెండో ఎల్లో కార్డ్‌తో మైదానం వీడాడు. దీంతో ప్రపంచకప్ ఫైనల్లో రెడ్ కార్డ్ పొందిన ఆరో ఆటగాడిగా నిలిచాడు.

ఈ విజయంతో స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడమే కాకుండా వరుసగా 38 మ్యాచ్‌లలో అపజయం ఎరుగని యూరోపియన్ జట్టుగా రికార్డు సృష్టించింది. అయితే, స్పెయిన్ చారిత్రక విజయం కంటే అర్జెంటీనా వివాదాస్పద ప్రవర్తనే ఎక్కువగా చర్చనీయాంశంగా మారింది.

## రూమర్స్ ఉంటనే మజా: రిటైర్మెంట్ పుకార్లపై తొలిసారి నోరువిప్పిన రోహిత్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో చారిత్రాత్మక సెంచరీతో విమర్శకుల నోర్లు మూయించిన టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తొలిసారి తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించారు. ఇంగ్లాండ్?తో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం హిట్ మ్యాన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇటువంటి రూమర్స్, విమర్శలు ఉంటేనే మజా ఉంటుందని అన్నారు. తనకు విమర్శలు కొత్తేమి కాదని.. తన సుదీర్ఘ కెరీర్?లో ఇటువంటి అటుపోట్లు ఎన్నో చూశానని అన్నారు. ఇటువంటి విమర్శలు, రూమర్స్ ఎన్ని వచ్చిన తాను పట్టించుకోనని.. తన దృష్టి మొత్తం కేవలం ఆటపైనే ఉంటుందని స్పష్టం చేశారు."నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి నాపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. నేను జట్టులో ఉన్నంత కాలం ఆ విమర్శలు వస్తూనే ఉంటాయి. అది నాకు ముఖ్యం కాదు. మైదానంలో నేను ఏమి చేస్తాననేదే ముఖ్యం. జట్టు విజయంలో నా వంతు సహకారం అందించడానికి ప్రయత్నించాలనుకుంటున్నాను. నా దృష్టి అంతా దానిపైనే ఉంది. అయినా ఇలాంటి రూమర్స్, విమర్శలు లేకపోతే సరదా ఉండదు" అని రోహిత్ శర్మ పేర్కొన్నారు.

**విరాట్ తో బ్యాటింగ్ వేరే లెవల్:**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో తన స్నేహం, కలిసి బ్యాటింగ్ చేయడం గురించి రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం చాలా సరదగా ఉంటుందన్నాడు. మేము ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటామని.. క్రీజులో ఆలోచనలను పంచుకుంటామని తెలిపారు. కెరీర్?లో కోహ్లీ, తాను ఎన్నో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పామని చెప్పారు. లార్డ్స్ వన్డేలో మా ఇద్దరి పార్ట్‌నర్ షిప్ కూడా చాలా బాగుందన్నారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965